ఆయాలు లేక ఇబ్బందులు

- అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ కేంద్రాలకు నియమించని ప్రభుత్వం

గూడూరు: మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మేయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం అందులో ఆయాలను నియమించకపోవడంతో కార్యకర్తలే అన్ని పనులు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని 152 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మేయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ గత సంవత్సరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలోనే ఆ కేంద్రాలలో ఆయాలను నియమించాల్సి ఉంది. గూడూరు మండలంలో 20మేయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఏ ఒక్క అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాలు లేరు. కానీ ఇప్పటి వరకు నియమించకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లే అవస్థలు పడుతున్నారు. అదీ


వాగ్యతండాలో అంగన్‌వాడీ కేంద్రం

కాక ఇటీవల అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వం కొన్ని సర్వేలకు వినియోగిస్తున్నారు. దీంతో ఇక ఆ కేంద్రాలు మూసి ఉండాల్సిన పరిస్థితులు లేకపోలేదు. ఇలాంటి సందర్భాల్లో ఆయాల అవసరం ఎంతో ఉంది. ఆయాలు ఉన్న చోట ఎలాంటి ఇబ్బంది లేదు. ఆయాలు లేని చోట కార్యకర్తలే పౌష్టికాహారం వండిపెడుతున్నారు. ఇదిలా ఉండగా ఆయాల పోస్టులను భర్తీ చేస్తే కొంతమంది మహిళలకైనా ఉపాధి లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అంగన్‌వాడీ వ్యవస్థలోను 65 ఏళ్ల వయస్సు నిండిన వారితో పదవీ విరమణ చేయించారు. ఈనేపథ్యంలో అనేక చోట్ల ఆయాలు, అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల ఖాళీలు ఏర్పడ్డాయి. అప్‌గ్రేడ్ చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా ఆయా పోస్టులు, పదవీ విరమణ కారణంగా ఖాళీ అయిన స్థానాల్లో భర్తీ చేపడితే బాగుటుందని పలువురు సూచిస్తున్నారు. మండలంలో 20మంది ఆయాలతోపాటు విరమణ పొందిన స్థానాల్లో కార్యకర్తల ఖాళీలు ఉన్నాయి. ఇదే విధంగా జిల్లాలోని ప్రతి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 152 ఆయాలతోపాటు విరమణతో ఖాళీ అయిన కార్యకర్తలు, ఆయాల స్థానాల్లో కూడా కొత్త వారిని నియమించాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీలకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నా..



పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్నా. ఇప్పుడు మేయిన్ కేంద్రంగా అప్‌గ్రేడ్ అయింది. అందులో ఆయా లేదు. ప్రతీ రోజు పిల్లలకు పౌష్టికాహారం, గర్భిణీ, బాలింతలకు పోషకాహారం ఇస్తున్నాం. ఆయా లేకపోవడంతో ఇబ్బంది కల్గుతుంది.

- మైదం రామక్క, అంగన్‌వాడీ కార్యకర్త

నియామక ఆదేశాలు రాలేదు



అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు విరమణతో ఏర్పడిన ఖాళీల్లో నియామకంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు వెలువడలేదు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఆయాలు, కార్యకర్తల పోస్టులు ఎన్ని ఖాళీగా ఉన్నాయనే వివరాల సేకరణ జరుగుతుంది. త్వరలోనే పోస్టులు భర్తీ కావచ్చు.

- నీలోఫర్ అజ్మీ, సీడీపీఓ, గూడూరు

కాంగ్రెస్ పార్టీతోనే పల్లెల అభివృద్ధి

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే నియోజకవర్గంలోని పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చీకటాయాపాలెం, మాటేడు, పోలెపెల్లి, మడిపెల్లి, కంఠాయపాలెం, అమ్మాపురం, జమస్థాపురం, గుర్తూరు, ఖానాపురం, చీకటాయాపాలెం, వెంకటాపురం, కర్కాల, వెలికట్ట, నాంచారీమదూరు గ్రామాలకు ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా మంజూరైనా సుమారు రూ.2కోట్ల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్లు, సైడ్ కాల్వల నిర్మాణ పనులకు, ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఆయా గ్రామాలకు వెళ్లిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి నాయకులు, కార్యకర్తలు డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు సుంచు సంతోష్, సోమరాజశేఖర్, గంజి విజయపాల్‌రెడ్డి, మేకల కుమార్, సోమయ్య, కిశోర్ రెడ్డి, మల్లేశంగౌడ్, శ్రావణ్‌కుమార్, రాజేష్‌యాదవ్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

తొర్రూరు: పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో పట్టాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, నాయకులు పానుగోటి సోమేశ్వర్‌రావు, మంగళపల్లి రామచంద్రయ్య, జినుగ సురేందర్‌రెడ్డి, సోమ రాజశేఖర్ పాల్గొన్నారు.


తొర్రూరు రూరల్: సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

విద్యార్థినికి సన్మానం

పెద్దవంగర: విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన గద్దల రమ్యశ్రీ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించినందుకు గాను శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీతో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి రమ్యశ్రీని ఘనంగా సత్కరించి సన్మానించారు.

‘భగీరథ’ ప్రయత్నం

కొత్తగూడ: నాడు ప్రజల కోసం గంగను భూమికి దింపడానికి భగీరథుడు తపస్సు చేశాడని కథలు విన్నాం. ఏజెన్సీ రైతులు పంటలు పండించుకోవడనికి అంతకన్నా భారంతో కూడిన భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. కొత్తగూడ ఏజెన్సీలో రైతులు ఎక్కవ మొత్తంలో బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నారు. వ్యవసాయం చేయాలంటే నీరు లేకుండా చేయలేమని అనుకున్న కొత్తపల్లి, పెగడపల్లి, రౌతుగూడెం, పొగుళ్లపల్లి రైతులు సంయుక్తంగా పాకాల శిఖం వాగుల నుంచి తమ పొలాలకు సుమారు 3నుంచి 5కిలోమీటర్ల దూరం పైపులైన్ లక్షల రూపాయలు వెచ్చించి వేసుకుంటున్నారు. చూసే వారు ఇది నిజంగా భగీరథ ప్రయత్నమేనని చర్చించుకుంటున్నారు.


సాగునీటి కోసం పైపులైన్ వేసుకుంటున్న రైతులు

రైతు వ్యతిరేక సంస్కరణలకు కుట్రలు

నెల్లికుదురు సెంటర్: పెట్టుబడిదారు, కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవసాయ రంగంలోకి రైతువ్యతిరేక సంస్కరణలు తీసుకువచ్చేలా ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చల రంగయ్య అన్నారు. సంఘం జిల్లా ప్రథమ మహాసభల సందర్భంగా పూనెం ప్రభాకర్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రభాకర్, ఉడుగుల రాములు అధ్యక్షతన మహాసభలను శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా కెచ్చల రంగయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతూ రైతుల సంక్షేమాన్ని పూర్తి విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, ముంజంపల్లి వీరన్న, ఉమ్మగాని సత్యం, జక్కుల యాకయ్య, ఈక బిక్షం, బొమ్మగాని ఎల్లయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రంగయ్య

కేసీఆర్‌ను అరెస్ట్ చేసే దమ్ముందా..

మాజీ ఎంపీ సీతారాంనాయక్

మరిపెడ: గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ చేయించిన విషయం ప్రపంచమంతా తెలిసిందేని అందుకు బాధ్యుడైన కేసీఆర్‌ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టే దమ్ము ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి ఉందా అని మాజీ ఎంపీ, బీజేపీ నేత ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ ప్రశ్నించారు. శనివారం ఖమ్మం జిల్లాలోని పాలేరులో బీజేపీ తలపెట్టిన సంకల్ప యాత్రకు హాజరు కావడానికి వెళ్తూ మరిపెడ ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆగాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సచివాలయంలో లంకెబిందెలు ఉన్నాయని రేవంత్‌రెడ్డి సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాడన్నారు. వచ్చే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో కాషాయం జెండా ఎగరడం ఖాయమన్నారు. త్వరంలో మరిపెడలో చేపట్టే బీజేపీ సంకల్ప యాత్రను విజయంతం చేయాలని సీతారాంనాయక్ కోరారు.


మాట్లాడుతున్న సీతారాంనాయక్

అవినీతిపై విచారణ జరిపించాలి


ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గార్ల: మండలంలోని మద్దివంచ పంచాయతీలో ఈజీఎస్ పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గంటపాటు ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి న్యూడెమోక్రసీ, సీపీఐ నాయకులు మాట్లాడారు. మద్దివంచ పంచాయతీలో ఈజీఎస్ సిబ్బంది, మేట్లు కలిసి ఉపాధి పనులకు రానివారి పేర్లకు మస్టర్లు వేసి, వారి అకౌంట్లలో వేతనాల రూపేణా డబ్బులు వేశారని ఆరోపించారు. అవినీతి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ మంగమ్మకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జడ సత్యనారాయణ, జంపాల వెంకన్న, రాగం రమేష్, గౌని భద్రయ్య, మల్లేశం, కుసిని బాబూరావు, మాగం లోకేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

బయ్యారం: త్వరలో బయ్యారంలో హమాలీ యూనియన్ జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ తెలిపారు. శుక్రవారం బయ్యారంలో నిర్వహించిన హమాలీ యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త కార్మికసమ్మెను హమాలీలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగన్న, సీఐటీయూ మండల కన్వీనర్ వెంకన్న, హమాలీ యూనియన్ నాయకులు మోహన్, ప్రవీణ్, రాంరెడ్డి, పురుషోత్తం, సోమిరెడ్డి, పెంటయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉపేందర్

భర్త, అత్తామామలపై కేసు నమోదు

డోర్నకల్: తనను పెళ్లి చేసుకున్న తరువాత వేరే యువతిని మరో పెళ్లి చేసుకుని మోసం చేశారంటూ ఓ యువతి తన భర్త, అత్త, మామతోపాటు మరో యువతిపై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డోర్నకల్ సీఐ బి.రాజేష్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ శివారు రాజుతండాకు చెందిన బోడ స్వప్నకు భూపాలపల్లికి చెందిన బోడ హర్షిత్‌తో గత మే నెల 8న వివాహం జరిగింది. వివాహ సమయంలో 200గజాల ప్లాటు, అరెకరం పొలం, రూ.4లక్షల రగదు, 6 తులాల బంగారం కట్నంగా ఇచ్చి వివాహం చేశారు. వివాహం జరిగిన కొద్ది రోజులకే హర్షిత్ వేరే యువతితో నిత్యం ఫోన్‌లో మాట్లాడటం, అత్తామామలు కూడా భర్తకు మద్దతు తెలపడం, అదనపు కట్నం కోసం వేదించడం లాంటివి చేశారని స్వప్న ఆరోపిస్తుంది. ఈక్రమంలో కొద్ది రోజుల క్రితం హర్షిత్ ఇంటి నుంచి వెళ్లిపోయి ఆ యువతిని వివాహం చేసుకున్నట్లు తెలిసింది. దీంతో భర్త హర్షిత్‌తోపాటు అత్త బోడ పద్మ, మామా బోడ హరిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యూట్యూబర్ ఫిర్యాదు మేరకు..

భూపాలపల్లికి చెందిన బోడ హర్షిత్ డోర్నకల్ శివారు రాజుతండాకు చెందిన స్వప్నను వివాహం చేసుకున్న కొద్ది రోజుల తరువాత యూట్యూబ్ నిర్వాహకురాలు భూపాలపల్లి జిల్లా, మహాముత్తారం మండలం యమనపల్లికి సాయిప్రియను వివాహం చేసుకున్నాడు. సాయిప్రియ వద్ద కెమెరామెన్‌గా పని చేస్తూ ఆమెను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈక్రమంలో శుక్రవారం పెద్దపల్లిలో హర్షిత్‌తోపాటు సాయిప్రియను పట్టుకున్న బోడ పద్మ, హరి వారిపై దాడి చేసి కారులో డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో తనపై హర్షిత్‌తోపాటు పద్మ, హరి దాడి చేశారంటూ చేసిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇంటి ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెద్దవంగర: జనావాసాల మధ్య, ఓ ఇంటి ఎదుట నిత్యం మృత్యుఘటికలు మోగిస్తూ ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. మండలంలోని చిన్నవంగర గ్రామంలోని రాపోలు వెంకటేశ్వర్లు ఇంటి ఆవరణలో నెలకొన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ భద్రత రహితంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. గత పదిహేళ్లుగా ఇక్కడే ఉండగా షార్ట్ సర్క్యూట్‌లు జరగడం, నిప్పురవ్వలు ఇంటి ముందున్న రేకులపై పడడం వంటి సంఘటనలు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు ప్రమాదాలు జరగక ముందే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇతర భద్రమైన ప్రాంతానికి మల్లించాలని స్థానికులు కోరుతున్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న స్థానికుడు

సంక్షిప్త సమాచారం

ఆపరేషన్ కగార్‌ను వెంటనే రద్దు చేయాలి

నెల్లికుదురు సెంటర్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే రద్దు చేసి మావోలతో శాంతిచర్చలు జరపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. ఈనెల 25న వరంగల్‌లో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా జరగనున్న సదస్సును జయప్రదం చేయాలని పోస్టర్లను శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, లింగ్యా, చైతన్య, పాపయ్య, మధు, హరీశ్, లక్ష్మయ్య, కోటేష్, మురళీ పాల్గొన్నారు.

సీపీఐ గ్రామశాఖ కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ రూరల్: మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామ శాఖ కార్యదర్శిగా పుణ్యపుర్తి శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్ శుక్రవారం తెలిపారు.

హద్దులు ఏర్పాటు చేయాలి

గార్ల: గార్ల పెద్దచెరువు శిఖం భూమికి వెంటనే హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు కందునూరి శ్రీనివాసరావు, కట్టెబోయిన శ్రీనివాసరావు, అలువాల సత్యవతి, వి పెద్దవెంకటేశ్వర్లు, నాగమణి, రాగం రమేష్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంపిణీ

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో జీవన్ ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు చిరుధాన్యాల విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ సాక్రూబాయి, కిరణ్, సోమయ్య, హీర్యా, వెంకన్న, లక్ష్మణ్, కమల పాల్గొన్నారు.

భూమి పూజ

గూడూరు: గూడూరు, చెంద్రుగూడెంలతోపాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్ నాయకులతో కలిసి ఇల్లు మంజూరైన లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేశారు.

డాక్టరేట్ పొందిన సురేందర్‌కు సన్మానం

తొర్రూరు రూరల్: డాక్టరేట్ పొందిన అధ్యాపకుడు మొగిలిచర్ల సురేందర్‌ను నాంచారీమదూరులోని మహాత్మజ్యోతిరావు పూలే సోషల్ వెల్ఫర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్, అధ్యాపకులు పూలమాలలు, శాలువాలతో శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని నాంచారీమదూరు గ్రామంలోని మహాత్మ జ్యోతిరావ్ పూలే బీసీ గురుకుల (బాలురు) డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరిప్రసాద్ తెలిపారు.

సభను విజయవంతం చేయాలి

గార్ల: ఇల్లెందులో నేడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం గార్లలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు గుండా వెంకట్‌రెడ్డి, భూక్యా నాగేశ్వరరావు, మాలోత్ వెంకట్‌లాల్, తాళ్లపల్లి కృష్ణగౌడ్, సుందర్ పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

డోర్నకల్: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు గుగులోత్ సూర్యప్రకాష్ డిమాండ్ చేశాడు. శుక్రవారం డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈఓ ఆంగోత్ లక్ష్మానాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నరేష్, సురేష్, నవీన్ పాల్గొన్నారు.

జర్నలిస్టు సంఘం కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ అర్బన్: దళిత జర్నలిస్టు సంఘం జిల్లా అడహాక్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా కన్వీనర్‌గా కట్కూరి ప్రసాద్, కోకన్వీనర్లుగా జిన్న లచ్చయ్య, పూర్ణ, మంద విక్రం, ప్రేంసాగర్, రోషయ్య, ధర్మారపు శ్రీనివాస్, వల్లందాసు సుధీర్ ఎన్నికయ్యారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

డోర్నకల్: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాల విక్రయంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ ఆంగోత్ లక్ష్మానాయక్ హెచ్చరించారు. శుక్రవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు.

అధికార పార్టీ వాళ్లకే ఇందిరమ్మ ఇళ్లు

గార్ల: అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని బాలాజీతండా మాజీ సర్పంచ్ ఆర్.శంకర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. అధికారులు స్పందించి ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

పేదోడి సొంతింటి కల నెరవేర్చిన సీఎం

మరిపెడ రూరల్: పేదోడి సొంతింటి కలను నెరవేర్చిన గొప్ప నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అని వీరారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బానోతు హరిసింగ్ అన్నారు. శనివారం మరిపెడ మండలం వీరారం రెవెన్యూ పరిధిలోని జీన్యతండలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర వెంకన్న, దాసరి మునేష్, బానోతు రామచంద్రు, జెట్టి రాములు, అజ్మీర సూర్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామంలో డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ చిత్ర పటానికి కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మినేని సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్లు రాలేదని, ప్రస్తుతం గ్రామంలో ప్రతీ పేదవాడికి ఇళ్లు వచ్చిన ఆనందంలో క్షీరాభికం చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గార్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన శుక్రవారం గుంపెళ్లగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన చెన్నూరి వెంకన్న (50) ఏప్రిల్ 10వ తేదీన సత్యనారాయణపురం నుంచి గుంపెళ్లగూడెంకు టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై ఇంటికి వస్తుండగా, గార్ల నుండి సత్యనారాయణపురం వెళ్తున్న కారు ఇందిరానగర్‌తండా సమీపంలో ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రగాయాలైన వెంకన్న హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నెల రోజులపాటు చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. ఈనెల 14న వెంకన్న ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో చేర్చి చికిత్స జరిపిస్తుండగా గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వెంకటేశ్వరరావు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా వెల్లడించారు.

పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఎంపీడీఓ రామారావు శుక్రవారం సందర్శించారు. నార్మల్ విజిట్‌లో భాగంగా పాఠశాలలో కిచెన్ రూం, తరగతి గదులను పరిశీలించి పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా వంటగదులు, తరగతి గదులు, పాఠశాల చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. లేకుంటే వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ లలిత, టీచర్స్, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ విద్యార్థులకు తెలుగు, రసాయనశాస్త్రం బోధించేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బి.విజయ శుక్రవారం తెలిపారు. ఈనెల 23 తేదీన సోమవారం సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు. అభ్యర్థులకు పీజీ, బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు మానుకోట జిల్లా కేంద్రంలోని ధర్మన్నకాలనీలో ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సంప్రదించాలన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

పెద్దవంగర: జ్ఞాన ప్రదాయిని సరస్వతీ దేవి కటాక్షంతో విద్యార్థులు విజ్ఞాన జ్యోతులుగా వెలుగొందాలని హెచ్‌ఎం సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్నటువంటి ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా సాముహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు.


పెద్దవంగర: అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం

కురవి: మండలంలోని నల్లెల్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు శుక్రవారం అక్షరాభ్యాసం చేయించారు. కాంపెల్లి వీరన్న వెంకటలక్ష్మి దంపతులు చిన్నారులకు చికెన్‌తో భోజనం అందించారు. ప్రీ–స్కూల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీ, కాంపల్లి సూపర్‌వైజర్ రమణ, అంగన్‌వాడీ టీచర్లు ఉపేంద్రమ్మ, అనసూయ, సుభద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాగ్రత్తలు పాటించాలి

తొర్రూరు రూరల్: ఆయిల్‌పామ్ సాగులో జాగ్రత్తలు పాటించాలని జిల్లా హార్టికల్చర్ అధికారి మానస రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అమ్మాపురం, ఖానాపురం గ్రామాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం ప్రతి చెట్టుకు సరిపడా సాగునీరు అందిస్తూ, రైతులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.

రుచికరమైన భోజనం పెట్టాలి

మరిపెడ రూరల్: ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులతో అంగన్‌వాడీ కేంద్రాలలోని లబ్ధిదారులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని అంగన్‌వాడీ సెంటర్ సూపర్ వైజర్ రాణి అన్నారు. మరిపెడ మండలం నీలికుర్తి సెక్టార్ మూన్యతండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

జయప్రదం చేయండి

నెల్లికుదురు సెంటర్: జూలై 5, 6 తేదీలలో కురవి మండల కేంద్రంలో జరగనున్న సీపీఐ జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. 19వ వార్డులోని పార్థసారథి కాలనీ శాఖ మహాసభ నాగార్జున, వెంకటమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సభలో అజయ్‌సారథిరెడ్డి, కుమార్, నవీన్, రమేష్, అశోక్, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలో పట్టణ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు.

కల్లు పోయలేదని దాడి

మహబూబాబాద్ రూరల్: కల్లు అమ్ముకునే వ్యక్తి తమకు అడిగిన విధంగా కల్లు పోయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇద్దరు యువకులు అతడిపై దాడిచేయగా వారిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. రౌడీషీటర్ కట్ల తేజ, మరో యువకుడు సోమ మణికంత ఇద్దరు కలిసి పట్టణంలోని మంగలికాలనీ ప్రాంతంలో కల్లు తాగేందుకు వెళ్లి కల్లు విక్రయిస్తున్న వ్యక్తిని కొట్టారన్నారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

మాదిగలు ఆర్థికంగా ఎదగాలి

మరిపెడ: మాదిగలు సామాజికంగ ఆర్థికంగా ఎదగాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కోళ్ల శివ అన్నారు. మరిపెడలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి ముందుకు నడవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్, మండల అధ్యక్షుడు ఐనాల వెంకన్న, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, వంగూరి బాబు, స్వామి, వీరబాబు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

మహబూబాబాద్ రూరల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ అంకితభావంతో ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని మండలంలోని పర్వతగిరి జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ హెచ్ఎం మందుల శ్రీరాములు అన్నారు. మండలంలోని మల్యాల ఎంపీ యూపీఎస్, దామ్యతండా ఎంపీపీఎస్, రోటిబండతండా ఎంపీపీఎస్ పాఠశాలలను శ్రీరాములు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. హెచ్ఎంలు చీనా, షబ్బీర్ అలీ, వసుమతి పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ

బయ్యారం: మండలంలోని సింగారంలో దివంగత ఉపాధ్యాయుడు గంగావత్ రాజన్న విగ్రహంను టీఎస్ టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరునాయక్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహంను ఏర్పాటు చేసిన రాజన్న భార్య పద్మ, కుమార్తెలు బిందు, రుష్మితను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాయకులు శివనాయక్, భద్రు, భాస్కర్, భావ్‌సింగ్, బాలాజీ, బిచ్చ, రాంబాబు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్ రూరల్: బావి నీరు కలుషితం అనే శీర్షికన ‘సాక్షి’ దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి మహబూబాబాద్ ఎంపీడీఓ రఘుపతిరెడ్డి స్పందించారు. మండల పంచాయతీ అధికారి పార్థసారథి జంగిలిగొండ గ్రామానికి వెళ్లి పైపులైనుకు మరమ్మతులు చేయించారు.

వీరన్న సన్నిధిలో పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామిని మహబూబాబాద్ విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాసచారి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

వాహన తనిఖీలు

చిన్నగూడూరు: మండల కేంద్రం శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు.